# కథానిక

● కె. సదాశివరావు ● చిత్రాలు: ఏ.ఆర్. పాళాల

ఈ లోకంలో కొన్ని ప్రశ్నలకు సరైన సమాధానాలుండవు. కళలెందుకు? కవిత్వమెందుకు? అంతా మిథ్య... అంతా మాయ అని నమ్మేవారికి ముఖ్యంగా ఇవి చాలా ఔచిత్యమున్న ప్రశ్నలు. నాకు కథలన్నా కవితలన్నా ప్రాణం. మంచి కథైనా, కవితలైనా దొరికితే చదివి ఆనందిస్తానే కాని నాకు రాసే టాలెంట్ లేదు. ప్రయత్నించి చూశాను. నేను రాసిన వాటిల్లో బొత్తిగా కవిత్వం అనే అంశం లేనే లేదు అని నాకర్థమయింది. కవితా రహస్యం తెలిసే అవకాశం ఈ జన్మలో లేదు అని తొందరగానే జ్ఞానోదయమవటంతో ఇక కాలం వృథా చేయకుండా చదవటం మీద కేంద్రీకరించాను. నా మిత్రులు చాలామంది రచయితలే. నేనో మంచి పాఠకుణ్ణి.



మేమందరమూ ప్రతి ఆదివారంలాగే ద్వారకా హోటల్ కెఫెటేరియాలో సమావేశమయ్యాము. అదే స్థలం: కుడి చేతివేపున్న మూలలో రెండు మూడు టేబుల్స్‌ని కలిపి గుంపుగా క్రిక్కిరిసి కూర్చుంటాము - మేం సాహితీ ప్రియులం... అని మా సామూహికాభిప్రాయం... ఇతరుల దృష్టిలో వెర్రి కవిగాళ్ళు. రచయితలు, జర్నలిస్టులు, కవులూ, కాలమ్‌లు రాసేవాళ్ళూ, విమర్శకులూ... వివిధమైన సాహిత్యాభిరుచులున్నవారూ. ప్రతి నెలా రెణ్ణెల్లకో ఓ కథల పుస్తకమో, కవితా సంకలనమో, నవలో, విమర్శ వ్యాస సంపుటి... ఏదో ఒకటి బయటికొస్తుంటుంది. వాటి మంచి చెడ్డలు చర్చించటం మా కార్యక్రమంలోని ముఖ్యాంశం. ఇది ఇన్‌ఫార్మల్ క్లబ్. మెంబర్‌షిప్ రూల్సంటూ లేవు. ఎవరేనా వచ్చి ఓ కుర్చీ లాక్కుని కాఫీ ఆర్డర్ చేసి సిప్ చేస్తూ వింటూ కూర్చోవచ్చు లేదా జరుగుతున్న చర్చలో నిర్మొహమాటంగా పాల్గొనవచ్చు. మేము ఎన్నో ఏళ్ళ నుంచీ మెంబర్సమి. కొత్తగా హైదరాబాద్ వచ్చినప్పుడూ, ఉద్యోగాన్వేషణలో ఉండి ఒడిదుడుకులు పడుతున్నప్పుడూ, ఉద్యోగాలు వచ్చాక, పుస్తకాలు అచ్చయి, కాస్త పేరూ, అవార్డులూ అవీ వచ్చినా కూడా.. ఇది మామూలే. జంట నగరాల సాహిత్య సీనులో ఇది ఓ ముఖ్య భాగం.

"అదిగో ద్వారక! కవుల మందలవిగో" అంటూ నాగభైరవగారు పేరడీ చేశారు కూడా.

ఒకటి నిజం. మాకందరికీ సాహిత్యమంటే ప్రాణం. ఈ సమావేశాల్లో ప్రపంచ సాహిత్యంలో, ఇతర భాషల్లో, ఇతర ఖండాల్లో, ఇతర దేశాల్లో వస్తున్న సాహితీ పరిణామాలనూ, కవితా ఉద్యమాలనూ చర్చించేవాళ్ళం. ఈ చర్చల ప్రభావం సమకాలీన సాహిత్యం మీద ఉందో లేదో మాకు తెలియదు. ఈ క్లబ్ రెగ్యులర్ మెంబర్స్... శివారెడ్డి, నవీన్, చేరా, అజంతా, జగన్నాథ శర్మ, పద్మావతి, రవిశంకర్, చలసాని ప్రసాదరావు, స్మైల్, కృష్ణమూర్తి యాదవ్, ఆశారాజు, శిలాలీ, మహె జబీన్, ఓల్గా, కుటుంబరావు, నిర్మల... ఈ నగరం వచ్చినప్పుడు తప్పకుండా హాజరు అయ్యేవారు ఎందరో. కా. రా మాష్టారు, ఎండ్లూరి సుధాకర్, మోహన్ ప్రసాద్, నానరరెడ్డి, శ్రీనివాస్, చెట్టు ఇస్మాయిల్, పతంజలి శాస్త్రి... ఎందరెందరో.

అంతు లేని మా వాగుడినీ, కేకలనీ పట్టించుకోకుండా హోటల్ మేనేజ్‌మెంట్, సర్వింగ్ స్టాఫ్ ఎంతో అభిమానంతో, ఓర్పుతో మాకు కాఫీలూ, టిఫిన్లూ సప్లై చేసేవారు. అవి తాగుతూ, తింటూ మాట్లాడుతుంటే..... సాయంకాలాలు గడిచిపోయేవి. అలాంటి ప్రశాంత సాయంత్ర సమయాన మాకో కొత్త పేరు వినిపించింది. ఎవరో చెప్పగా విని నవీన్ మాకందరికీ తెలియజేశాడు. అంతకుముందు గోదావరిలో హైదరాబాద్ వస్తుంటే తన కంపార్ట్‌మెంట్‌లో పక్క సీట్‌లో కూర్చున్న పెద్దాయనతో సంభాషణ సాహిత్యం మీదకి తిరిగినప్పుడు పరంజ్యోతి గురించి తెలియజేశారట. అది ఓ కవి పేరు. ఆయనకి అందర్లాగే ఓ కులమూ, మతమూ, గోత్రమూ, శాఖా, ప్రశాఖా అన్నీ ఉన్నాయిట. పేరులో సఫిక్సులూ, ప్రిఫిక్సులూ కూడా ఉన్నాయి. కానీ, వాటి మీద నమ్మకం లేదనీ, దరిమిలానూ మాకు తెలియడం వలన ఇక్కడ అవేవీ చెప్పడం లేదు. అతడి పేరు మేము ఎన్నడూ వినలేదు. ఆయన కవితలు ఎవరూ చదవలేదు. చేరా కూడా. ఆ విధంగా ఆయన ఓ ఎనిగ్మాగా, మిస్టరీగా, పారడాక్స్‌లా తోచాడు.

"ఆయన గురించి మనం వినలేదు కానీ, ఆయన భావకవుల సమకాలికుడు. కృష్ణశాస్త్రికీ, రాయప్రోలుకీ, నాయనికీ మంచి మిత్రుడు. ఆయన ఇంకా బ్రతికే ఉన్నాడు. బాగా పెద్దవాడైపోయాడు. ట్రెయిన్‌లో పెద్దాయన చెప్పిన విషయాలను బట్టి చాలా చురుకుగా, చలాకీగా ఉంటాడనిపించింది" అన్నాడు నవీన్.

"ఎక్కడుండాడాయన?" అడిగాడు శివారెడ్డి ఆత్రతతో.

"చిత్తూరులో. వయసు ఎనభై పైనే ఉండాలి. రైలు పెద్దాయన మాట నిజమైతే గర్భదారిద్ర్యంలో ఉన్నాడు. కానీ, జ్ఞాపక శక్తి మాటకారితనం అద్భుతం అని విన్నాను."

"ఎంతసేపూ రైలు పెద్దాయన అనకపోతే, ఆయన పేరూ అడ్రసూ తీసుకోకపోయావా నవీనూ" అన్నాడు చేరా.

"తీసుకుందామనే అనుకున్నాను సార్.

రాజమండ్రిలో నేను ప్లాట్‌ఫారమ్మీదికి దిగి టీ తాగి వచ్చేనరికి ఆయన దిగిపోయాడు. అరెరె అనుకున్నాను. మంచి ఛాన్సు పోయింది. హైదరాబాదు వరకూ వస్తాడను కోవటం నా పొరపాటు." సంజాయిషీలా చెప్పాడు నవీన్.

"ఆయన ఏమి రాశాడో చెప్పాడా మీ రైలు పెద్దాయన."

"అదేమిటి సార్. మీకు తెలియనిది నా కెట్లా తెలుస్తుంది." నవ్వుతూ అన్నాడు నవీన్. "కానీ, ఆయన భావకవితా కాలంలో అద్భుతమైన కవితలు రాశాడని చెప్పాడాయన. కొన్ని కోట్ చేశారు కూడా. కానీ, ఆ కవితలు ఏ పత్రికలలోనూ అచ్చుపడలేదు. ఏ సంకలనాలలోనూ రాలేదు. పుస్తకాలుగా అసలు రాలేదు. ఆయనకదో పిచ్చి. కృష్ణశాస్త్రిగారు తన మిత్రులతో అనేవాడట, తన అభిమాన కవి వరంజ్యోతి అని. ఆయన కోట్ చేసిన కొన్ని వాక్యాల్ని నేను గబగబా నోట్‌బుక్‌లో రాసుకున్నాను" అని జేబులో నుంచి చిన్న పాకెట్ నోట్‌బుక్ బయటకు తీశాడు.

"చదువు నవీనూ" అన్నాడు శివారెడ్డి బల్ల మీద ముందుకి వాలుతూ.

"ఇచటనే ఈ లోకముననే నిశ్శబ్ద గర్భాన
ఇచటనే ఈతిబాధల ఘోష వినిపించును
అలసిన గాలులలో విరిగిన అలలలో కలియునవి
మణిమయ లోకపు స్వప్నాంతర్భాగమున నేను
చూచెదను కనులారా సాంద్రహరితారణ్యమును"

"మరణమా అతిశయమేల
పిలిచిరి నిన్నెవరో
మహత్తర శక్తివనీ
భయానక మూర్తివనీ"

"ఈ లైన్స్ మీరు విన్నారా ఎప్పుడైనా?" అడిగాడు నవీన్.

అందరమూ తలలూపాము అడ్డంగా వినలేదని. ఇది భావకవిత్వమేనన్న దానిలో సందేహం లేదు.

"కృష్ణశాస్త్రి ఈ లైన్స్‌ని కోట్ చేసేవాడని ఆయన చెప్పాడు. ఆప్త మిత్రులతో ఉన్నప్పుడు ఆయన ఒప్పుకునేవాడట వరంజ్యోతి తనని మించిన కవి అని. కానీ, వరంజ్యోతిగారి రచనలు పూర్తిగా చదివే అవకాశం ఎవరికీ దొరికి ఉండకపోవచ్చు.

చిన్న చిన్న కవితా ఖండికలు నాలుగైదు లైన్లు ఇలా చెప్పగా వినడం తప్ప ఆయన కావ్యాలు ఎక్కడా లభ్యం కావు. ఆయన కావ్యాలు రహస్యంగానే ఉండి పోయాయి. కవి చదవగా విన్న కొద్ది మంది లక్కీ ఫ్రెండ్స్‌కే తెలిసిన అముద్రిత కావ్యాలవి. మాస్టర్‌పీస్‌లే అయి ఉండాలి. కవి సమ్మేళనాలలో ఎక్కడా ఆయన పాల్గొన్నట్లు లేదు. వచ్చి కూర్చుని ఇతర కవుల కావ్యగానాల్ని విని ఆనందించి, తన దారిన తాను లేచి వెళ్ళిపోయేవాడట. అసలు ఆయనకి ఉన్న మిత్రులే తక్కువట."

"పబ్లిష్ చేయలేదు సరే, ఆయన ఇంకేమన్నా రాశాడా?" అడిగాడు జగన్నాథ శర్మ.

"మరో మూడు నాలుగు కావ్యాలు రాశాడట. వాటిని గురించి కథలు చెప్పు కోవటం తప్ప ఎవరూ నిర్ధారించలేదన్నాడు ఆ రైల్లో పెద్ద మనిషి."

"ఈయనెవరండీ బాబూ! అచ్చేయకపోతే రాయటమెందుకూ?" అన్నారెవరో.

"దానికి ఆయనే చెప్పాలి ఆన్సర్" అన్నాడు రవిశంకర్ మెల్లగా.

"ఎవరికీ తెలియకుండా, ఎవరూ చదవకుండా, ఎవరూ వినకుండా పోతున్న, పోబోతున్న లెజెండ్. ఎందుకు ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడు?" మాకెవరికీ అర్థం కాలేదు.

"తన రచనలు పెర్‌ఫెక్ట్‌గా ఉండాలని ఆయన ఆశయమట. యాబ్సల్యూట్ పెర్‌ఫెక్షన్ కావాలట."

"అసలు కళల్లో, సాహిత్యంలో యాబ్సల్యూట్ పెర్‌ఫెక్షన్ అనేది ఉంటుందా సార్." యాకూబ్ అడిగాడు చేరాని.

"అంతా సాపేక్షం. తేలికగా ఏదీ చెప్పలేము." తన తరహాలో తేల్చేశాడు చేరా.

"నేను రాసినదంతా పెర్‌ఫెక్ట్ అని నా నమ్మకం. లేకపోతే నేను రాసే వాణ్ణికాదు. పుస్తకం వేసేవాణ్ణి కాదు" అన్నాడాయన.

అందరూ నవ్వారు.

"ఇట్లాంటి తిక్క ఉంటే ఆయన పుస్తకమూ వేసేదిలేదు. మనం వాటిని చదివే ఛాన్స్ ఉండదు భాయ్" అన్నాడు స్మైల్ నిస్పృహతో.

"అదేమీ ఆయనకి పట్టకపోవచ్చు. ఆయన కీర్తి కోసం సాహితీ చరిత్రలో తనకో స్థానం కావాలన్న తపన పడి రాసే వ్యక్తి కాదేమో. నిజానికి తన పేరుకీ, సాహిత్యానికీ ఏ రూపంలోనూ సంబంధం లేకుండా ఎంతో జాగ్రత్తపడుతున్నాడు. మీరు వినే ఉంటారు. గ్రేట్ ఫ్లూటిస్ట్ టి.ఆర్. మహాలింగం 'మాలి' అన్న పేరుతో ప్రసిద్ధుడు. ఆయన ఓ మ్యూజికల్ జీనియస్. ఎక్సెంట్రిక్. టెంపరమెంటల్ ఆర్టిస్ట్. ఆయనకో నమ్మకం. తన జీవితకాలంలో ఏదో ఒక రోజున తన కచ్చేరీలో ఎంత అద్భుతంగా వాయిస్తాడంటే, కచ్చేరీ అయిపోయాక వింటున్న శ్రోతలు మంత్రముగ్ధుల్లా కూర్చుండిపోతారని. ఇక లేవరు వాళ్ళు. ఆ స్పెల్ అలాగే ఉండిపోతుంది. ఎలా ఉంది ఐడియా? క్రేజీ. ఈయనా దాదాపు అంతే. సగం సగం పూర్తయిన కావ్యాలూ, తనకే సంతృప్తి కలిగించని కవితలు ప్రజల మీదికి వదలటం ఇష్టం ఉండదు. అది అన్యాయమని ఆయన వాదమట. ఆ రైలు పెద్దాయన చెప్పాడివన్నీ" అన్నాడు నవీన్.

"ఆయన నిజంగా ఉన్నారా గురుగారూ" అడిగాడు దేవిప్రియ.

ఇదంతా ఓ కాన్ఫిడెన్స్ ట్రిక్‌లా, ఓ హోక్స్‌లా అనిపించటంలో ఆశ్చర్యమేముంది?

"నిజంగానే బ్రతికి ఉన్నారని చెప్పాడాయన."

"అయితే, మనం ఏదో ఒకటి చేయాలి. ఏమంటావు స్వామీ?" అడిగాడు నన్ను శివారెడ్డి. నాదేముంది నేను సిద్ధమేనన్నాను.

"ఆ కావ్యాలని ఎలాగోలా సంపాదించి పబ్లిష్ చేయగలిగితే అద్భుతంగా ఉంటుంది. అవి వేరే కవితా యుగానికి చెందినవి అయినప్పటికీ - అవుటాఫ్ ప్లేస్... అవుటాఫ్ టైమ్....ఆ తరం సాహితీ చరిత్రలో వాటి స్థానాన్ని అవి సంపాదించుకుంటాయి. కాలక్రమంలో ఇది ఎలాగూ జరుగుతుంది. కానీ, ఈ కవితల ప్రభావం ముందు తరాల మీద ఎలా ఉంటుందో చెప్పలేం. అది వాటిలోని కవితా శక్తి మీద ఆధారపడి ఉంటుంది" అన్నారు చేరా.

"ఆ మాన్యుస్క్రిప్ట్స్ ఎలాగో సంపాదిస్తే వాటిని నేను ఎడిట్ చేస్తాను" అన్నాడు మోహన్ ప్రసాద్ సిగరెట్ పొగ వదులుతూ.

"కాదు కాదు. మన చెట్టు ఇస్మాయిల్ గారికి ఆ బాధ్యత అప్పగిస్తే బావుంటుందేమో. ఆయనకి అలాంటి కవిత్వమంటే అభిమానం కూడా. పైగా కృష్ణశాస్త్రిగారి పద్యాల సంపుటి ఒకటి ఆయన ఎడిట్ చేస్తున్నట్లు తెలిసింది" అన్నాడు రవిశంకర్.

"అవునవును. అదే సరైనది." ఒప్పుకున్నాడు అజంతా.

"అచ్చువేయటం... ఇతర విషయాలూ... కంపోజింగ్... ప్రింటింగ్ నేను చూసుకుంటాను. మంచి పేపర్ మీద లేసర్ టెక్నాలజీతో అచ్చు వేద్దాము. బాపుగారికి వీలుంటే మంచి బొమ్మలు వేయిద్దాం" అన్నాడు నవీన్.

"బాపుగారికి సినిమాలతో తీరిక ఉండక పోవచ్చు" అన్నారెవరో.

"అయితే, మన వీర్రాజుగారు ఉండనే ఉన్నారు."

శీలావీ అంగీకారంగా చిరునవ్వు నవ్వాడు.

మొత్తానికి ఆయనని కలిసి, ఆ రాత ప్రతుల్ని ఎలాగోలా తెచ్చే బాధ్యతని నా మీద ఉంచారు మా మిత్రులు. కంపెనీ సేల్స్‌మాన్‌గా నేను ఎలాగూ రాష్ట్రమంతటా తిరుగుతూనే ఉంటాను. చిత్తూరు ప్రతినెలా వెళుతూనే ఉంటాను.

ఓ పది రోజుల్లో వెళ్ళాను కూడా. ఆయనని కలవడమూ జరిగింది.

మళ్ళీ ద్వారకా సమావేశంలో చిత్తూరులో ఏం జరిగిందో అందరికీ వివరించాను.

ఆయన అడ్రస్ ఎలాగో సంపాదించి ఆ ఇల్లు కనుక్కొని వెతుక్కుంటూ వెళ్ళాను. ఆయన వయసు ఎనభై, ఎనభై అయిదు దగ్గర్లో ఉంటుంది. ఆయనని చూడటానికి నేను హైదరాబాదు నుంచి వచ్చానని చెప్పినప్పుడు ఆయన ఆశ్చర్యపడ్డాడు.

"ఇంత శ్రమపడి నన్ను కలియటానికి రావటం నాకు ఎంతో ఆనందంగా ఉంది నాయనా. నేను బ్రతికే ఉన్నానని మా దగ్గర బంధువులకి తప్ప ఇంకెవరికీ తెలియదు. ఈ రోజుల్లో కేవలం నన్ను చూడటానికే ఇంత శ్రమ తీసుకున్నావా?"

"లేదండీ. మీ గురించి ఎన్నో విషయాలు విన్నాం మేము. మిమ్మల్ని చూసి మీ పరిచయ భాగ్యం కలిగాక, మీ రచనలని వీలుంటే మీ వద్ద నుండి తీసుకెళ్ళి చదవాలనీ....మీరు అనుమతిస్తే వాటిని ప్రచురించాలనీ మా అందరి అభిలాష."

ఆయన చిన్నగా నవ్వారు బోసినోటితో. నేను చుట్టూ చూశాను. ఆ ఇల్లు జీర్ణావస్థలో ఉన్నది. గోడలు పెచ్చులూడిపోయి...... పైకప్పు సరిగా లేకుండా.... పెంకులు రాలిపోయి........ఉన్న రెండు గదుల ఇల్లు. ముందు చిన్న వసారా.. అరుగూ.......ఇంటి వెనుక చిన్న పెరడూ ఉన్నాయి. పెరట్లో ఓ ములగచెట్టూ..... కొద్దిగా పాదులు ఉన్నాయి. ఒకటో రెండో బంతి మొక్కలున్నాయి. అతి దీనావస్థలో ఉన్న ఇల్లది. అక్కడ కొయ్య కుర్చీలు రెండున్నాయి. నులకమంచమొకటి..... పాత బీరువా ఒకటుంది. అక్కడ ఆకలి తాండవిస్తోంది. ఆ ఇంటినీ...... ఇంట్లో ఉన్న అన్ని వస్తువులనీ....... ఆ ఇంటి ఫౌండేషన్‌తో సహా సమూలంగా భక్షించేలా ఆకలితో ఉన్నట్లున్నాయి ఎలుకలు. పాడుబడిన ఆ ఇల్లు ఏ క్షణాన కూలుతుందో చెప్పడం కష్టం. గోడ వగుళ్ళు విచ్చి ఉన్నాయి. బయట ఉన్న ఓ చిన్న నెరలో మర్రి మొక్క పెరుగుతోంది. ఆ గోడలలో ఏమంత సత్తువ లేదు. ఏనాడో గానుగ సున్నంతో కట్టి మళ్ళీ ఏ విధమైన రిపేర్స్ చేయని గోడలవి. ఇంటి పైకప్పున ఎన్నో చిల్లులున్నాయి. వర్షాకాలంలో ఆ ఇంట్లోని మనుషులకి ఆ ఇల్లు ఏమాత్రం రక్షణ ఇవ్వలేదు. ఈదురుగాలులు వీస్తాయి లోపలే.... వర్షపాతాన్నుండి ఆ ఇల్లు ఎవరినీ కాపాడలేదు. ఇంతకీ ఈ ఇంట్లో వీళ్ళిద్దరూ

ఎట్లా బతుకుతున్నారు? ఆయన భార్య బాగా వృద్ధురాలు. ఆమె ప్రక్క గదిలో ఉంది. ఆమెను నేను ఒకటి రెండు సార్లు మాత్రమే చూశాను. కాస్త వంగిన నడుంతో ఉంది. బాగా మగ్గిపోయిన పండులా ఉంది. చిన్న ముడీ... చెవులకి నీరు పట్టిన పోగులూ... ముక్కుకి ఓ ఒంటిరాయి ముక్కుపుడకా.. మెడలో పసుపు తాడూ... చేతులకి మట్టి గాజులూ... అతి సాధారణమైన నేత చీర.. ఎన్నో చిరుగుల్ని ఓపికగా కుట్టినది. నుదుట పెద్ద కుంకుమ బొట్టు. ఆమె ఉన్న గది వంటిల్లూ... పూజగది... ఇంకా ఏవేవో గదుల భూమికని ధరిస్తున్నదేమో!!

ఈ గదిలో ఓ నులక మంచం ఉంది. అది తాళ్ళు తెగి కుక్కిమంచంలా నానా కంగాళీగా ఉంది. ఆ నులకని ఎన్ని సార్లో తెగిపోతే కలిపి ముళ్ళు వేసి ఉంటారు. మూలన ఓ ట్రంక్ పెట్టె ఉంది తుప్పు పట్టి... ఏనాడో వేసిన ఆకుపచ్చ రంగు రాలిపోతూ అక్కడక్కడా పాచ్‌లుగా ఉంది. దండెం మీద నాలుగు పాతగుడ్డలూ.... అంతే...

పరిచయాలూ, పరామర్శలూ పూర్తయాక నేను అసలు విషయానికి డైరెక్ట్‌గా వచ్చేశాను.

"పరంజ్యోతిగారూ, మీరు ఎన్నో కావ్యాలూ, కవితలూ రాశారని చెప్పుకుంటారు. అవి ఎక్కడున్నాయండీ?"

"నాయనా, నేను రాసింది చాలా తక్కువ. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. ఎన్ని ఇళ్ళు మారామో! ప్రతిసారీ సామాన్లు సర్దుకోవడంలో తొందరలో అజాగ్రత్త వలనా, అశ్రద్ధ వలనా చాలా కాగితాలు... మంచి కవితలున్నవి పోయాయి బాబూ... నా కిష్టమైన వాటిని ఫెయిర్ చేసి జాగ్రత్తగా పెట్టెలో ఉంచాను భద్రంగా. కొన్ని కాపీలూ...చిత్తు ప్రతులూ అదిగో ఆ పెట్టెలో ఉన్నాయి." మూలనున్న ఆకుపచ్చ పెట్టె కేసి చేయి చూపించాడు.

"ఆ ఫెయిర్ కాపీలు నేను చూడవచ్చా?" ఎంతో ఆదుర్దాతో అడిగాను. అవి దొరికితే వెంటనే హైదరాబాద్‌కి తీసికెళ్ళి మా బృందం ఆధ్వర్యంలో వాటిని ప్రచురించటానికి ప్రయత్నం చేయాలి. హమ్మయ్య! నేను వచ్చిన పని విజయవంతం కాబోతున్నదన్న ఊహ నాకెంతో ఆనందాన్ని కలిగించింది. ఓ మంచి పుస్తకం చేతికి రాబోయే సమయంలో పుస్తకాలంటే పడి చచ్చే వ్యక్తికి ఎలా ఉంటుందో అలాంటి అనుభూతి నాది.

"నాయనా, ప్రస్తుతం ఆ పెట్టె నా దగ్గర లేదు."

"ఏమయింది?" పట్టరాని ఉత్సుకతతో అడిగాను నేను.

ఆయన మాట్లాడలేదు. నేను ఆయన జవాబు కోసం ఎదురు చూశాను. అప్పుడు వెనుక గదిలో నుంచి ముసలమ్మగారు గొంతు విప్పింది. అదేదో బుల్లి పక్షి కంఠంలా మృదువుగా ఉంది. జీవన సమరంలో దెబ్బలు తిన్న పక్షి కంఠమది. ఏళ్ళాదిగా లేమితో యుద్ధం చేస్తూనే తన డిగ్నిటీని పోగొట్టుకోని వ్యక్తి కంఠమది.

"తాతల్నాటి అందమైన చెక్కపెట్టె బాబూ అది. ఆ అప్పులాడు పట్టుకుపోయాడు."

"ఎవడండీ అతను?"

ముసలమ్మే సమాధానమిచ్చింది.



"ఉన్నాడు బాబూ. మాకు అప్పులిచ్చి ఇళ్ళూ, వాకిళ్ళూ, ఇంటిలోని సామానులూ అన్నీ పట్టుకుపోయాడు. మా ఉసురు తగలకపోదు వాడికి. చివరికి ఆయన ప్రాణసమానంగా చూసుకునే రచనలుండే ఆ పెట్టెను లాక్కుపోయాడు బలవంతంగా. మాకున్న సిరి సంపదలూ, మడులూ మాన్యాలూ, నగా నట్రా... సర్వస్వమూ పోయినప్పుడు కూడా ఆయన బాధపడలేదు. ఆ రోజునే ఆయన కళ్ళల్లో దుఃఖం చూశాను బాబూ. రాళ్ళల్లో బ్రతుకుతున్నాము. ఎందుకు బ్రతుకుతున్నామో తెలియకుండా. ఆయన పంచ ప్రాణాలూ ఆ పెట్టెలోనే ఉన్నాయని ఆ మూర్ఖపు వెధవకి తెలుసు. వాడో డబ్బు మనిషి."

"సరస్వతీ, నీవు ఊరుకుంటావా?" ఆయన చిరు మందలింపుతో అన్నాడు. "అప్పు తీసుకున్నాక తీర్చక తప్పదు కదా? ఎవరు మాత్రం ఊరుకుంటారు నీవు చెప్పు నాయనా. అతడి దగ్గర కొంత డబ్బు తీసుకున్న మాట వాస్తవం. అతడు తిరిగి తిరిగి విసిగెత్తి ఆ పెట్టె పట్టుకుపోయాడు. ఏం చేస్తాడు అతడు మాత్రం?"

"మరీ అంత మొరటుగానా? ఎవరండీ ఆయన?"

"కొత్తపేటలో ఉంటాడు నాయనా. శరభయ్యని... అతడిది వడ్డీ వ్యాపారం. తాకట్లూ అవీ పెట్టుకుని డబ్బు ఇస్తుంటాడు."

"ఇంతకీ అప్పు ఎంతండీ?" అడిగాను.

"రెండు వేలో, మూడు వేలో."

"వాడి శ్రాద్ధం. రెండు వేలకి మించదు నాయనా. వాడి కాకి లెక్కలతో నాలుగు వేలదాకా తేలుస్తాడు. ఆ లెక్కలు మాకిద్దరికీ అర్థం కావు. అతడేం చెబితే అంత. వాడి ఇళ్ళూ వాకిళ్ళూ, వాడి ఐశ్వర్యం, వాడి పెళ్ళాం ఒంటి మీది నగలూ అన్నీ ఈ ఇంటిలోంచి పోయినవే బాబూ. మాలాంటి వాళ్ళు ఇంకెంత మంది ఉన్నారో, ఈ దౌర్భాగ్యపు లోకంలో!" ముసలావిడ అన్నది.

ఉద్రేకాన్ని అణచుకోలేకుండా ఉంది ఆమె. గుండెల్లోంచి పొగలూ సెగలూ వస్తూ ఉండాలి ఆమెకి.

"అయిందేదో అయింది. మీరు నిశ్చింతగా ఉండండి సార్! నేను హైదరాబాద్ వెళ్ళి, మా మిత్రులను కలిసి ఏమైనా ప్రయత్నం చేసి, మళ్ళీ ఓ వారం పది రోజుల్లో తిరిగి వస్తాను. ఎలాగోలా ఆ డబ్బు తేవటానికి మేమందరం ప్రయత్నిస్తాము. మీ కావ్యాలు బయటికి రావాలి."


"పిచ్చివాడివి నాయనా."

"మీరేమైనా అనుకోండి. నాకేమీ అభ్యంతరం లేదు." నవ్వుతూ అన్నాను. "మిమ్మల్ని కలిసి మీతో మాట్లాడటం ఓ అదృష్టంగా భావిస్తున్నాను. మళ్ళీ వస్తాను."

జేబులో నుండి ఓ రెండు వందల రూపాయలు తీసి ఆయన చేతిలో పెట్టబోయాను. ఆయన తీసుకోలేదు. పైగా చేతులు వెనక్కి లాగేసుకున్నాడు.

"తెలియనివాళ్ళ దగ్గర డబ్బు తీసుకోవటం నాకు అలవాటు లేదు నాయనా. వద్దు."

"నన్ను మీ ఆత్మీయుల్లో ఒకడిగా భావించండి. మళ్ళీ మళ్ళీ వచ్చి మిమ్మల్ని వేధించబోతున్నాను. ఇది అప్పుగానే తీసుకోండి. మీ రచనలు అమూల్యమైనవి. వాటికి వెల కట్టటానికి ప్రయత్నం చేసే సాహసం మాలో ఎవరికీ లేదు. అవి పుస్తకాలుగా అచ్చు వేయాలని మా మిత్రుల ఆకాంక్ష. అది ఆచరణలో పెట్టాలని మేము నిర్ణయం తీసుకున్నాము. అందువల్ల ఏదో విధంగా ఆ అప్పు తీర్చి మొదట మనం ఆ పెట్టెని స్వాధీనం చేసుకోవాలి. ఇక్కడి విషయాలు మా హైదరాబాద్ మిత్రులకి చెప్పి, ఏవో ఏర్పాట్లు చేసి, నేను మళ్ళీ తిరిగి వస్తాను. మీకు నేను ఈ డబ్బు ఉచితంగా ఇవ్వడం లేదు. మీకు ముందు ముందు రావలసిన రాయల్టీలో ఇది అడ్వాన్స్ అనుకోండి. అంతకన్నా ఇప్పుడు నేనేమీ చెప్పలేను. వెళ్ళి వస్తానండి. వస్తానమ్మా."



ఆ డబ్బు మంచం మీద ఉంచి నమస్కరించి నేను వచ్చేశాను.

ద్వారకాలో ఆదివారం సాయంత్రపు సభ క్రిక్కిరిసింది. మిత్రులందరూ నేను చెప్పిన విషయాలను విన్నారు. వెంటనే చందాలు వేసుకుందామని ప్రతిపాదించారు. స్మైల్ శ్రీపతి, శీలావీ అందరూ సరేనన్నారు. పది నిమిషాల్లో టేబుల్ మీద ఓ డబ్బు పోగు వెలిసింది. అందులో పావలాలూ, అర్ధలూ, అయిదులూ, పదులూ, కొన్ని వందరూపాయల నోట్లూ, రకరకాల నాణాలు చేరిపోయాయి. కొందరు జేబులు దులిపేశారు. పద్మావతీ, ఓల్గా, నిర్మలా, మహె జబీన్ వాళ్ళ హ్యాండ్ బ్యాగ్స్‌లో ఉన్న డబ్బు అక్కడ వేశారు. చాలామంది ఇళ్ళకి పోవటానికి..... సిటీ బస్ టికెట్లకీ.... ఆటోలకి సరిపడా ఉంచుకుని మిగిలినదంతా టేబుల్ మీద వేశారు. అంతా లెక్క పెట్టాము. తొమ్మిది వందల దాకా తేలింది. మాకింకా నాలుగు వేల పైచిలుకు కావాలి. మొత్తం ఐదు వేలు పోగు చేయాలనుకున్నాం. వెయ్యి రూపాయలు వరంజ్యోతి గారికిస్తే వాళ్ళు కొన్నాళ్ళు ఇబ్బంది లేకుండా కాలక్షేపం చేయవచ్చు. ఈ మధ్యలో వాటిని ముద్రించి మంచి పబ్లిషర్, సెల్లర్ ద్వారా అమ్మి, అలా వచ్చే డబ్బుని ఆయన చేతిలో పెట్టి మా బాధ్యతని తీర్చుకోవాలనుకున్నాం. ఆయన ఒప్పుకుంటే ఓ సన్మానం కూడా చేస్తే బాగుంటుందని సజెస్ట్ చేశారెవరో. ఇలా ఎన్నో ప్లాన్స్ వేసి ఆనాడు మేమందరమూ ఇళ్ళకి పోయాము. తరువాత వారం పదిరోజులు మిగిలిన డబ్బు కూడబెట్టటంలోనే సరిపోయింది. మొత్తానికి అయిదు వేలు జమయ్యాయి.

నిజానికి మా బృందంలోని చిన్న చిన్న ఉద్యోగులకీ, లెక్చరర్లుగా పనిచేస్తున్న వాళ్ళకీ... సంసారాలతో, చదువుకుంటున్న పిల్లలతో, ఇతర బాధ్యతలతో ఉన్న వాళ్ళకీ వాళ్ళ జీతాల్లోంచీ, సంపాదన నుంచీ ఇవ్వగలిగే ప్రతి రూపాయీ త్యాగంగానే భావించాలి. కవిత్వానికీ, కథలకీ ఎంత డబ్బు వస్తుందో ఎవరికీ తెలియని రహస్యమేమీ కాదు. నవలలు రాసి బతకవచ్చేమోకాని ఇతర సాహిత్య ప్రక్రియలకి ఏమంత ఆర్థికపరమైన ప్రోత్సాహం ఉండదు. అందువల్ల ఈ రోజుల్లో జీతాల మీద ఆధారపడి బతికే జర్నలిస్టులూ, ఆర్టిస్టులూ... వాళ్ళకి వచ్చే ప్రతి పైసాకీ సరిపడే ఖర్చులుంటాయి. ప్రతి రూపాయి విలువైనదే. గుంభనగా అవసరాలని అదుపులో ఉంచుకుని జాగ్రత్తగా ఓ ప్లాన్‌తో, క్రమశిక్షణతో పొదుపుగా సంసారాలు సాగిస్తూ, వచ్చే నాలుగు రాళ్ళతోనే బతుకుతూ సాహిత్యమంటే ప్రాణమిచ్చే మా మనుషులు కడుపులు కట్టుకుని చిన్న చిన్న అప్పులు చేసీ సంతోషంతో వాళ్ళ వంతు సాయం చేశారు. ఎలాగైతేనేం అనుకున్న సమయానికి డబ్బు సమకూడింది.

నేను మళ్ళా చిత్తూరు ప్రయాణం తలపెట్టాను. ఆఫీసు పని ఉంది అక్కడ. ఓ రెండు రోజుల క్యాంప్. ఇదే సమయంలో పనిలో పనిగా ఆ డబ్బు అక్కడ ఇచ్చి వరంజ్యోతి గారి రచనలను హైదరాబాద్ తీసుకురావాలనుకున్నాను. నేను వెళ్ళేప్పుడు ఎన్నడూ లేనిది ఈసారి కొందరు మిత్రులు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కి వచ్చి నాకు వీడ్కోలు చెప్పారు.

నా ఆఫీసు పని ఒక్క రోజులోనే ముగించుకున్నాను. రాత్రి పది గంటలకి బయలుదేరి వరం గారింటికి వెళ్ళాను. ఆయన వీధి అరుగు మీద కూచుని ఉన్నాడు, వీధి లాంతరు వెలుగులో. ఆమె లోపలున్నట్లుంది. పెందలాడే భోజనాలయిపోయినట్లున్నాయి. నా పేరు చెప్పగానే ఆయనలో అదో రకమైన రియాక్షన్ వచ్చింది.

"వచ్చావా నాయనా?" అన్నాడు.

"ప్రొద్దున్నే వచ్చానండి. పగలంతా నా పనులతో సరిపోయింది. ఎట్లా ఉన్నారు మీరు?"

"ఈ వయసులో బాగుండటమంటూ ఉండదు నాయనా. వృద్ధాప్యానికి మించిన జబ్బు లేదు" అని అదేదో జోకులాగా నవ్వాడు.

బయట కొంచె చలిగా ఉంది. ఆయన ఘాసిన పంచెపైన నన్నటి ఉత్తరీయం. నా గొంతు వినగానే గుర్తు పట్టి ఆమె లోపల కాఫీ కాచే ప్రయత్నం మొదలు పెట్టింది. మేము జనరల్ విషయాలు కాసేపు మాట్లాడేలోగా ఆమె కేకవేసింది.

"ఇలా వచ్చి కాఫీ తీసుకెళతారా!"

వెళ్ళి రెండు గ్లాసులు తెచ్చి ఒకటి నాకు ఇచ్చారాయన. మేము వేడి కాఫీ సిప్ చేస్తూ మాట్లాడుకున్నాము.

అప్పుడే తెలిశాయి నాకు ఆయన గురించిన ఎన్నో విషయాలు. ఆయనకి కుల గోత్రాల మీద నమ్మకం లేదనీ, భావుకత ఎవరికీ ప్రత్యేకంగా వచ్చే సామూహిక ఆస్తి కాదని ఆయన నమ్మకమనీ, మనుషులందరూ సమమేననీ, అవకాశం వస్తే కష్టపడితే ఎవరైనా కళాకారులుగా, సాహితీ వేత్తలుగా మారగలరనీ, భావుకత కొందరికి స్వభావ సిద్ధంగా సంభవించే అపురూపమైన వరమనీ, కొందరికి సరైన అవకాశాల్లేక అడుగునపడిపోయి కానరాకుండా పోతుందనీ, అలాగే సమర్థత, కళా పరిపక్వత, లోతైన దృష్టి, వైదుష్యం లేకపోతే ఎంత ఆరాటపడినా, ఎంతమంది పొగిడినా పసలేని ప్రక్రియలు మనలేవనీ.... ఆయన కాలంలో కొన్ని ఉదాహరణలతో సహా చెప్పాడు. ఇవన్నీ ఎవరైనా రాస్తే ఎంత బాగుంటుంది?

"సార్ మిమ్మల్ని ఒకటి అడగాలనుంది."

"అలాగే అడుగు నాయనా" అన్నాడు చిరునవ్వుతో.

వాత్సల్యం నిండిన ఆ చిరునవ్వు ఓ ఆశీర్వచనంలా ఉంది. వృద్ధాప్యంతో ముడుతలు పడి కాల ప్రవాహంలో కరిగిపోతూ చివరి దశలో ఉన్న ఆ ముఖం ఓ క్షణం వెలిగిపోయింది.

"మీరు భావ కవితాయుగంలో ఓ ముఖ్యమైన కవి అని కొందరు తెలిసిన వాళ్ళు చెప్పుకుంటారు. మీ కవితలని పుస్తకాలుగా అచ్చువేయలేదు మీరు. ఎందుకని?"

ఆయన నవ్వు అలాగే ఉంది, బోసిగా....ప్రశాంతంగా...

"ఏ పనైనా ఎందుకు చేయాలి? చేయాలని ముందు మనకి అనిపించాలిగా నాయనా."

నేను మాట్లాడలేదు.

"మనుషులకి రకరకాల వ్యాపకాలుంటాయి. వాళ్ళకి నచ్చేవీ, వాళ్ళకి ఆనందాన్నిచ్చేవీ....నాకు కవిత్వమంటే ప్రాణం. నిజమే.

అది నాకు జీవితం. అదే పరమార్థం. ఇక మన జీవితాల్లో ఇతర విషయ వాంఛలు ఎలాగూ ఉంటాయి. వాటన్నింటికన్నా ఉన్నతమైన స్థానాన్ని నేను కవిత్వానికి ఇచ్చాను. రాత్రింబవళ్ళు కళ్ళు పోయేలా నేను కవిత్వాన్ని చదివేవాడిని. అక్షరాలూ, పదాలూ, పదసముదాయాలూ, పత్రికలూ, ప్రకృతీ, సూర్య చంద్రులూ, పువ్వులూ, పక్షులూ, గాలులూ, ఋతువులూ, ప్రేమా, బాధలూ, ఆశా నిరాశా, దుఃఖభాజనమైన ఒంటరితనం... అన్ని కవితా వస్తువులనీ జీవన సరళిలో నుండి విడదీసి ఆ మానసికావస్థని క్లుప్త పద బంధాలతో చిత్రిస్తే కలిగే ఆనందం చెప్పటానికి అలవికానిది నాయనా! ఎలా చెప్పమంటావు? కవిత్వమొక అనంతసాగరం... నేను దానిలోని ఓ నాలుగు చుక్కలు తీసి తృప్తి చెందినవాడిని."

ఆగి ఆలోచనల్లో మునిగిపోయి అలా ఉండిపోయాడు కాసేపు.

"ఆపైన నాకు పెళ్ళి అయింది. పెళ్ళి తరువాత అయినా ఈ కవితా జ్వరం నుంచి బయటపడతానేమోనని, ఇహలోకంలోకి వస్తానేమోనని ఆశించారు మా పెద్దలు. నా భార్య సరస్వతి అనుకూలవతి. ఎంత కాదనుకున్నా మెల్లగా

నంసార బాధ్యతలూ.... పిల్లల పెంపకాలు...రోగాలు... రొష్టులు... చదువు సంధ్యలు... నన్ను నాకు తెలియకుండానే నంసార సాగరం లోనికి లాగివేశాయి. నేను ఎంతగానో ప్రతిఘటించాను. కానీ, నిత్య జీవితంలోని ప్రబల శక్తి ముందు నేను అసహాయుడనై కవిత్వపు ఉచ్చుల్లోంచి బయటకు పోయాను. అందుకనే కొత్త కవితలు నేను రాయనే లేదు. రాయటానికి కావలసిన నమయమూ, ప్రశాంతతా, మానసిక స్థితీ, కళాత్మకమైన ఉద్వేగమూ నాలోంచి పోయింది. బహుశా ఇంగ్లీషులో అన్నట్లుగా 'మ్యూజెస్ హావ్ లెఫ్ట్ మి. దే డెజర్టెడ్ మి...' దైనందిన జీవితపు యాంత్రికతతో నేను రాజీ పడిపోయాను.''

''మీకు ఇంగ్లీషు బాగా వచ్చా సార్.'' అంతులేని ఆశ్చర్యంతో అడిగాను.

''ఆయన మద్రాను ప్రెసిడెన్సీ కాలేజీలో బియ్యే చదివారు బాబూ. ఇంగ్లీషుని దొరబాబులా మాట్లాడేవారు. ఆ పుస్తకాలే తెగ చదివేవారు. ఆ కవిత్వప్పిచ్చి వదిలింది కానీ, నాయనా ఈయనకి లౌక్యం తెలియ లేదు. లోకంలో బ్రతకట మెలాగో నేర్చుకోలేదు. ఉన్న ఆస్తులన్నీ ఈయన అమాయకత్వం వల్ల మా కళ్ళముందే హరించుకుపోయాయి. పుట్టిన పిల్లల్లో ఒక్క కూతురే మిగిలిందనుకుంటే అదీ పెళ్ళయిన కొద్ది కాలంలో అదేదో మాయదారి జబ్బుతో పోయింది నాయనా. మా మనవడు వాళ్ళ తాతగారింట్లో పెరుగుతున్నాడు. అల్లుడేమో మళ్ళీ పెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లి ఉత్తము రాలనీ, మా మనవణ్ణి ప్రేమతో చూస్తుందనీ విన్నాము. అదే మాకు తృప్తి. మాకు ఉన్న ఒకే ఒక రక్త నంబంధం ఆ పిల్లాడే నాయనా. ఇక ఈయనకీ నాకూ ఈ రోజుల్లో ఎట్లా బ్రతకాలో తెలియదు'' అంది మునలమ్మ రుద్ధ కంఠంతో.

ఆయన చిరునవ్వుతో అన్నాడు.

''మా నరస్వతికి నేను డబ్బు నంపాదించలేదని కోపం. కలవారి ఇళ్ళలో పుట్టాము ఇద్దరమూ. లేమి అంటూ ఎరగం. తల్లి చాటున పెరిగిన పిల్ల తాను. ఒంటరిగా కవిత్వమూ, నా చదువు నంధ్యలూ- వీటితో పెరిగిన వాణ్ణి నేను. నిజానికి మా ఇద్దరికీ లౌక్యం తెలియదు. మొదటి రోజుల్లో పెద్దల నీడలో బ్రతికాము. వాళ్ళందరూ కాలం చేశాక పొలాల మీద వచ్చే అయివేజు మీద హాయిగా ఉండేవాళ్ళం. కానీ, అజమాయిషీ నరిగా లేక పంటలు తగ్గి ఖర్చులు అలాగే ఉండి పోయాయి. అప్పులు పెరిగి పోయేనరికి భూములు అమ్మటం మొదలయింది. అది ప్రారంభం అయ్యాక మాకు ఏమి జరుగు తున్నదో తెలియలేదు. పైగా, అమాయకత్వం, చాదస్తం....కాకులు వాలాయని ఎండబోసిన బస్తాల పప్పులు....ధాన్యాలూ పనివాళ్ళను తీసుకుపొమ్మనే మా అమ్మ. కరగటం మొదలైతే హిమాలయాలు కూడా ఆగవు నాయనా. మాలాంటి నంసారాల నంగతి ఏముంది. ప్రస్తుతం ఈ స్థితిలో ఉన్నాము. ఏది పోయి నప్పుడూ నేను బాధ పడలేదు. నా కవితలున్న పెట్టెను అతడు బలవంతంగా గుంజుకు పోయిన నాడు నేను ఎందుకు బ్రతికి ఉన్నానా అన్న ప్రశ్న వచ్చింది. అన్నీ పోగొట్టుకుని ఇలా బ్రతకడం దేనికి అనిపించింది. ఇదంతా మాయలానే... ఏది జరుగుతుందో ఎవరికి తెలును? అంతా దైవేఛ్ఛ అని ఊరుకున్నాం.''

ఆయన అలా శోకభరితమైన స్వీయకథ చెబుతూంటే నా కడుపులో దేవినట్లయింది.

''మా నాన్నగారు అంటూ ఉండేవారు. ఈ లోకంలో రెండు రకాల మనుషులుంటారు. బ్రతికి చెడ్డవాళ్ళూ... చెడి బ్రతికిన వాళ్ళూ. ఒకప్పుడు ఐశ్వర్యం ఉండి దారిద్ర్యం లోనికి జారిపోతే చేయవలసిన త్యాగాలూ, అలవరుచుకోవలసిన జాగ్రత్తలూ, మార్చుకోవలసిన జీవన వైఖరీ... పద్ధతులూ... ఇన్నేళ్ళూ మేమిద్దరం ఎన్ని కష్టాలు ఓర్చుకున్నాము. ఎంతటి ఎత్తు పల్లాలకి లోనయ్యామో తలచుకుంటే భయమేస్తుంది.''

''మామూలుగా ఈయన అసలు మాట్లాడరు బాబూ. నీవు మాకు ఎంతో ఆత్మీయుడిలా తోచావు. ఆయన తన గుండె విప్పి మాట్లాడుతున్నారు. ఆయన ఇంతగా మాట్లాడటం విని ఎన్నేళ్ళయిందో'' అంది మునలావిడ.

టాపిక్ మార్చుదామనే ప్రయత్నంలో నేను ఆయన్ని అడిగాను.

''సార్, మీ కవిత్వానికి ఇన్‌స్పిరేషన్ ఏమిటి?''

అప్పటివరకూ జరుగుతున్న స్వీయ జీవన స్మృతులకి సడెన్ బ్రేక్‌లా పని చేయాలి నా ప్రశ్న. కానీ, అలా జరగలేదు.

''ఈ జీవితమే ఓ కల నాయనా. పట్టుబట్టలతో... గంధపు వాసనలతో... ధాన్యపు రాసులు నిండిన లోగిళ్ళతో... పాలూ పెరుగు నమృద్ధిగా...సిరినంపదలతో కళ కళలాడే ఇళ్ళలో...నవ్వు తప్ప ఎరుగని జీవితం నాది. జేబులో నోట్ల కట్టలు....కొత్త బట్టలూ... సెంటు వాసనలూ....అవన్నీ ఎక్కడ నుండి వచ్చాయో నాకు నా తలిదండ్రులు తెలియనీయలేదు. తెలుసుకోవాలని నాకూ అనిపించలేదు. అది స్వప్నలోకం. ప్రతిరోజూ పండుగే. పంచ రంగుల కమనీయ లోకంలో ప్రేమ,



ఆదరణ తప్ప ఏమీ తెలియకుండా పెరిగాను. నేను సంగీతమూ, సాహిత్యమూ, భావుకతా - ఇవే జీవనపరమావధి అనుకునే అమాయకపు కాలంలో పెరిగాను. మెలమెల్లగా భూములు కరిగిపోయాయి. ఎక్కడెక్కడి తోటలూ, పొలాలూ, మడులూ, దొడ్లూ అన్నీ పోయాయి. తెగనమ్మటంతో కర్పూరంలా హరించుకుపోయాయి. వాటి విలువెంతో నాకు అప్పుడు తెలియదు.''

''ఇప్పుడు మాత్రం తెలుసు మహా?'' నవ్వుతూ అడిగింది ముసలామె సరసంగా.

ఆయన నవ్వాడు.

''నిజమే. ఇప్పటికీ తెలియదు. తెలిసినా ప్రయోజనం ఏముంది సరస్వతీ?''

''అంతా మన ప్రారబ్ధం. ఎవరినీ అని లాభం లేదు లెండి'' అందామె ముక్తసరిగా.

''మీకు ఎవరూ సరైన సలహాలు ఇవ్వలేదా?'' అడిగాను.

''ఆయన మిత్రులందరూ ఆయనలాంటి వాళ్ళే నాయనా. ఒకరికీ తెలియదు పొలాలెక్క డున్నాయో. వెళితేకదా? ఈ రోజుల్లో ఎట్లా కుదురుతుంది బాబూ?''

మరోసారి టాపిక్ మార్చే ప్రయత్నంగా అడిగాను.

''మీ పద్యాలు కనీసం పత్రికలలోనైనా ఎందుకని ప్రచురించలేదు! ఆ రోజుల్లో సాహితీ పత్రికలెన్నో ఉండేవంటారు. 'భారతి,' 'ఆంధ్రపత్రిక,' 'శారద,' 'జ్వాల,' 'వినోదిని' - ఇవన్నీ ఆనాటివేకదా?''

''నిజానికి నా రచనల మీద నాకెప్పుడూ సంతృప్తి ఉండేది కాదు. అవి బాగానే ఉన్నా యని నాకు తెలుసు. కానీ, వాటిలో పెర్‌ఫెక్షన్ లేదనిపించేది. నా అభిమాన కవులు కీట్స్, షెల్లీ, బైరన్, వర్డ్స్‌వర్త్, బ్లేక్, డాన్....తెలుగులో పోతన, శ్రీనాథుడు, పెద్దన. వీళ్ళందరి కవితలూ నాకు కంఠోపాఠంగా వచ్చేవి...'' ఎక్కడో ఉన్న భూతకాలపు రోజుల్లోకి వెళ్ళిపోయినట్లుంది ఆయన మనసు. చూపుల్లో ఏదో మార్పు కనిపించింది.

''ఆధునిక తెలుగు కవుల్లో ఎవరిని మీరు అభిమానిస్తారు? మీరు మెచ్చిన కవితలేవి?''

''నా అభిమాన కవులూ... కవితలూ.....ఊఁ గుర్తు తెచ్చుకోనీ నాయనా.''

ఓ అరనిమిషం నిశ్శబ్దం.

''శీతవేళ రానీయకు, శిశిరానికి చోటీయకు... కవితా ఓ కవితా, ఆకులో ఆకునై, ఉయ్యాలూగి తివా, ఆవలేనే ఎంకి ఈ పడవ ఇసురు... ఎన్నని చెప్పను నాయనా? రాయప్రోలు, నాయని, కృష్ణశాస్త్రి, తుమ్మల...వీళ్ళందరూ నా అభిమాన కవులే.... జాషువా అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. అలాగే దువ్వూరి రామిరెడ్డి అన్నా. వీళ్ళ రచనలతో పోలిస్తే నా పద్యాలలో ఏదో లోపం ఉన్నట్లుగా అనిపించేది.''

''వాటిని మీరు మీ మిత్రుల ముందు మాత్రమే చదివి వినిపించేవారంటారు నిజమేనా?''

''మిత్రులే కదా! లోపాలేమన్నా ఉంటే సహృదయంతో చెబుతారేమోనన్న ఆశ. వాళ్ళందరూ మెచ్చుకునేవారు. ప్రచురించమని బలవంతం చేసేవారు. అవే పద్యాలను నేను మర్నాడు చదివితే వాటిలో ఎన్నో లోపాలు కనిపించేవి. ప్రతిసారీ మార్పులు చేయటం, పదాలు కొట్టివేయటం... ఒకోసారి పూర్తి కవితని మళ్ళీ మళ్ళీ తిరగ రాయటం జరిగేది. కవిత్వం చిక్కదనం కోసం, ఇంకా అందంగా వాటిని మలచటం కోసం, మనసుల్ని వెంటాడే పదబంధాలు సృష్టించటానికి ప్రయత్నం చేసేవాణ్ణి. నేనీ ప్రయత్నాలు చేస్తుండగా ఒక పక్కన ఈ సంపద తరిగిపోయింది. మరోవేపు ఎన్నో తరాలు గడిచిపోయాయి. ఎందరో మిత్రులు కాలగర్భంలో కలసిపోయారు. కవిత్వంలో ఎన్నో ఉద్యమాలు వచ్చాయి. కొత్త కుర్రాళ్ళు మంచి కవితల్ని రాస్తున్నారని విన్నాను. కొన్నేళ్ళవరకూ రోజూ లైబ్రరీకి వెళ్ళి అన్ని పత్రికలూ చదువుతూ ఉండేవాణ్ణి. ప్రస్తుతం కాళ్ళ బాధ వల్ల అంత దూరం నడవలేకపోతున్నాను.''

''ఇప్పుడు కాస్త ఇంటి పట్టున ఉంటున్నారు. లేకపోతే పొద్దున్న నాలుగు మెతుకులు వేసుకుని వెళ్ళిపోయి రోజంతా ఆ దిక్కుమాలిన లైబ్రరీలో ఉండి ఏ సాయంత్రమో వచ్చేవారు. ఇంటి దగ్గర నేను ఒక్కతినే బితుకు బితుకు మంటూ ఉండేదాన్ని'' అంది సరస్వతమ్మగారు.

''అంత మంచి కవిత్వం రాసి కూడా ప్రచురించనందుకు మీకు వెలితిగా ఉంటుందా? ఆ నిర్ణయం తప్పేనేమోనని ఎప్పుడైనా అనిపిస్తుందా మీకు?''

''లేదు నాయనా.'' ఆయన కంఠంలో దృఢ విశ్వాసం ఉంది. నిజాయితీ ఉంది. ''నాకే బాధా లేదు. నేనేమి రాశానో ఎవరికీ తెలియనప్పుడు ఏమవుతుంది. నా సమకాలికుల్లో ఎవరూ బ్రతికిలేరు. అది భావకవితా యుగమని విమర్శకు లంటున్నారు. నిజానికి నేను రాసినవి ఏ ఉద్యమానికి చెందుతాయో నాకు తెలియదు. ఎవరికీ తెలిసే అవకాశమూ లేదు. ఇవన్నీ ఎవరు పట్టించుకుంటారు నాయనా? కవులొస్తున్నారంటే జనం పారిపోతారు. హేళన చేస్తారు. కవి అంటే ఓ ఉన్మాది అనే అర్థం-చాలా మంది దృష్టిలో. నీవేమీ అనుకోనంటే నేనొకటి చెప్పనా?''

''చెప్పండి.''

''నా దృష్టిలో నీవు ఓ పెద్ద వెర్రివాడివి. నీ మిత్రులూ అంతే. మీ విలువైన కాలాన్ని వృథా చేసుకుంటున్నారు. ఇంత కష్టపడి నన్ను వెతుక్కుంటూ వచ్చి నన్ను కలిసినందుకు ఒక విధంగా సంతోషమేననుకో బాబూ. మీ వంటి మంచి మనసులున్నవాళ్ళు ఇంకా ఉన్నారన్న భావన గుండె నిబ్బరాన్ని ఇస్తుంది.''

ఆయన కళ్ళ నుండి కృతజ్ఞతలతో కూడిన చల్లటి చూపులు ప్రసరించాయి.

''సార్. నా దృష్టిలో మీ బాధ్యత సాహిత్యం సృష్టించడం వరకే. ఆపైన అది అందరికీ చెందుతుంది. అది అన్ని ఆస్తులకన్నా విలువైనది. మీ కవిత్వం తెలుగు వాళ్ళకి సంస్కృతీపరమైన సంపద. మీ కవితాత్మ నుండి వచ్చిన భావాలు, మీరు రాసిన కావ్యాలు....రాయటం వరకే మీవి. ఆపైన వాటి మీద పాఠకులకూ హక్కు ఉంటుంది. దానిని కాదనడం భావ్యం కాదు. మీరు నా మాట నమ్మండి. మేము మీ రచనలని ప్రచురిస్తాము. వాటిని ప్రజల ముందుంచుతాము. ఆపైన పాఠకులు, విమర్శకుల నిర్ణయాలు శిరోధార్యాలు. మీరు ఈ విషయంలో సహకరించాలి. ప్రస్తుతానికి నేను ఓ అయిదు వేలు తెచ్చాను. మీ దగ్గర ఈ వేయి రూపాయలు ఉంచండి. రేపు ఉదయం శరభయ్య గారికి నాలుగు వేలు ఇచ్చి అప్పు తీర్చేస్తాను. ఆ పెట్టెను నేను భద్రంగా హైద్రాబాదు తీసుకెళ్ళి ప్రచురణకి కావలసిన సన్నాహాలు చేస్తాను. ఇందులో మీ సహకారం లేనిదే మేము చేయగలిగేదేమీ ఉండదు.''

వేయి రూపాయలూ లోపల ఉన్న ముసలమ్మ గారి చేతిలో పెట్టాను.

అప్పటికే ఎంతో లేటయింది. బాగా చీకటి పడింది. చలిగాలి కొడుతోంది. రానున్న కాలాన్ని సూచిస్తూ గాలిలో శీతలపు చురుకుదనం గుచ్చుకొంటోంది. నేనైతే బనియనూ, పైన షర్ట్ వగైరా వేసుకుని ఉన్నాను. ఆయనకు కింద పంచె, పైన పల్చటి ఉత్తరీయమూ తప్ప మరే విధమైన ఆచ్ఛాదనా లేదు.

చలిగాలి అలలుగా వీస్తోంది. దాని ఉధృతం పెరిగే సూచన ఉంది. ఆయనకీ చలేస్తూ ఉండాలి.

''మీకు చలి వేయటం లేదా సార్?''

''అలవాటే నాయనా..... అది సరేగానీ, పద్యాలు వింటావా?''

అంతకన్నా కావలసిందేముంది?

''తప్పకుండా.'' సంతోషంతో నేను ఉక్కిరి బిక్కిరి అయ్యాను. నేను ఈ సమయం కోసమే ఎదురు చూస్తున్నాను. వచ్చినదీ ఇందుకే. ఆయన మంచి మూడ్‌లోకి వచ్చినట్లున్నాడు. 'అయామ్ లక్కీ! ఓ టేప్ రికార్డర్ తెచ్చి ఉండాల్సింది' అనుకున్నాను.

''ఇక్కడ మా మిత్రులందరూ ఉంటే ఎంత బాగుండేది.''

''పెరట్లో కూర్చుందాం పద నాయనా.''

నేను లేచి వెళ్ళాను.

అక్కడ నావరాళ్ళు పరిచిన చిన్న చదునైన ప్రదేశం ఉన్నది. ఆయన లోపలి నుంచి ఆకుపచ్చ రంగులో ఉన్న తుప్పు పడుతున్న ట్రంకు పెట్టెని పట్టుకొచ్చాడు. ఆమెతో ఏదో చెప్పాడు. నిద్రపొమ్మని కాబోలు. పెట్టెని కింద పెట్టాడు.

బరువు మోయటం వలన రొప్పుతున్నాడు. కాసేపాగి అన్నాడు:

''నేను నీకు పద్యాలు చదువుతాను. మనం ఓ చిన్న చలిమంట వేసు కుందాం. వెచ్చగా ఉంటుంది.''

''అలాగే'' అన్నాను. చలిమంటలు వేయటానికి కట్టెలు, గడ్డీ, పాత కాగితాలూ, ఎండిన తాటాకులూ లాంటివి ఏమన్నా ఉన్నాయేమోనని చుట్టూ చూశాను. అక్కడ అలాంటివేమీ లేవు.

ఇంతలో ఓ కోడిగుడ్డు లాంతరు తీసుకొచ్చి కింద పెట్టి పక్కనే చతికిలపడ్డాడు. నేను ఎదురుగా కాస్త ఎడంగా నిలుచుని చలిమంటల సరంజామా కోసం నలుమూలలా గాలిస్తున్నాను పెరట్లో.

''రా నాయనా కూచో.''

వెళ్ళి ఆయనకి ఎదురుగా కాస్త ఎడంగా కూచున్నాను. నావరాళ్ళు శుభ్రంగా ఉన్నాయి. కోడిగుడ్డు లాంతరు గాలిలో రెపరెపలాడుతోంది. ఆయన పెట్టెలోంచి ఓ కట్ట కాగితాలు తీశాడు. అవి బాగా పాతవి. నాలుగైదు దశాబ్దాల వయసున్నవి. పసుపుపచ్చ రంగులోనికి మారిపోయి ఉన్నాయి. వాటి మీద రాసిన ఇంక్ కూడా వెలిసిపోతోంది. చలిగా ఉంది. పైన ఆకాశంలో తారలు వెలుగుతున్నాయి. నాకేమీ అర్థం కాలేదు ఆయన ఏమి చేయబోతున్నాడో.

''ఇదేమిటండీ?''

"చలిమంటలు వేసుకుందాం నాయనా."

"ఏమిటీ ఈ కాగితాలతోనా?"

"పాత కాగితాలే నాయనా, రాసేసినవి" అన్నాడాయన తేలిగ్గా.

"వాటిలో కొంపదీసి దస్తావేజులూ, ఇతర డాక్యుమెంట్స్ ఏమైనా ఉన్నాయేమో చూడండి" అన్నాను ఆందోళనతో.

నవ్వి అన్నాడు:

"అవన్నీ తాకట్ల వాళ్ళ దగ్గరే ఉన్నాయి బాబూ. నీవేమీ కంగారు పడకు. ఇవన్నీ కవితలే."

"అన్నీనా?"

"అవును. నేను రాసిన కవిత్వపు చిత్తు పత్రులు... చాలా ఉన్నాయి. వీటిలో చెరువులూ, కొట్టివేతలూ ఉన్నాయి. ఫెయిర్ కాపీ చేసిన వాటిని వేరే పెట్టెలో భద్రపరచాను. వాటినే గదా పట్టుకుపోయాడు ఆ శరభయ్య. రేపు వాటిని తీసుకుందువుగాని నరే... పద్యాలు వింటావా?" ఆ కాగితాల వేపు నిశితంగా చూస్తూ అన్నాడు.

నరేనన్నానే గాని, నాలో సంశయంగానే ఉంది.

ఈ తిక్క ముసిలాయన ఎవరి మాటలూ వినడని తెలును. ఈయన మాటలు నిజమే అయితే ఫెయిర్ కాపీలు వడ్డీ వ్యాపారి ఇంట్లో క్షేమంగా ఉన్నాయి. అయినప్పటికీ, ఇవి మాత్రం ఎందుకు కాల్చాలి? ఏవైనా పనికిమాలిన వస్తువులు... గడ్డి గాదం, కట్టెలూ ఉంటే చలిమంటలు వేసుకోవచ్చుగాని కవిత్వంతోనా? నేను మథన పడుతుండగా ఆయన పద్య పఠనం మొదలు పెట్టాడు.

హృద్యమైన కమనీయ కంఠం... చక్కటి భావస్ఫోరకమైన ఉచ్చారణ... జీవం ఉట్టి పడేలా రాసిన కవిత్వం....నేను మంత్రముగ్ధుడిలా కూర్చుండిపోయాను. మొదటి పద్యాలు కోడి గుడ్డు లాంతరు వెలుగులో చదివి ఆ కాగితాలకి నిప్పు అంటించి మా మధ్య నున్న ప్రదేశంలో పడేశాడు. ఆ మంటల్లో అక్షరాలు కాలుతూ.... కాగితం మెలికలు తిరిగిపోతున్నది. నా గుండె చివుక్కుమన్నది. ఇది శాక్రిలిజ్! పాత కాగితాలు చిటపటలాడుతూ మండుతున్నాయి. కొన్త వేడీ... కొన్త వెలుగూ ఇస్తూ....ఆ వెలుగులో పరంజ్యోతిగారు తన కవితల్ని చదివి వినిపించటం మొదలు పెట్టారు ధారాపాతంగా.



ఆయన వయసులో ఉన్నప్పుడు కంఠంలో ఇంకా గాంభీర్యం, మాధుర్యం ఉండి ఉంటాయి. దశాబ్దాలనాడు ఆయన మస్తిష్కం లోంచి పుట్టి రూపు దిద్దుకుని కాలంలో చిక్కుకుని గూడు కట్టుకుని ఎక్కడో స్తంభించి పోయిన భావకవితా ఝరి ఆయన నోటి నుండి కర్ణానందకరంగా జాలువారింది. పిల్ల కాలువలా....పొంగే వరదలా..... నదిలా... ఉధృతమైన ఝంఝామారుతంలా, ఉద్వేగంతో దుమికే జలపాతంలా...సాగిపోయింది.

ఆ కవితా పఠనంలో ప్రవహించిన సరళ గీతికలూ, కవితా ఖండికలూ, తత్త్వ విచారభారంతో అస్తిత్వాన్ని కదిలించి, ఆత్మానందాన్ని కలిగించిన కవిత్వ భాగాలు, భావ శకలాలు, పద్యాలూ, గుండెల్లో తీయటి బాధని రేకెత్తించిన విషాద గేయాలూ, ఉగ్రూతలూగించిన దేశభక్తి నిండిన పద్యాలూ, పాటలూ, మన సంస్కృతీ ప్రాభవాలను చాటి చెప్పే చారిత్రక ఇతివృత్తాలతో అద్భుతంగా రాసిన రమ్య గీతికలూ...అన్నీ కలిసి కవితా ప్రభంజనంగా మారింది. ఆ సమయంలో కవిత్వం వర్షంలా కురిసింది. అదంతా నదిలా పారి నా మనసు లోతుల్లోనికి పోయి ఇంకిపోయింది.

వాటిలో ప్రేమ కవితలూ... రొమాంటిక్ పరిత్యక్తతని ప్రతిఫలించే విషాద గీతాలూ.... ప్రేమోద్వేగం.. ఆవేశం...ఆగ్రహం....మానవజాతి అనుభవించే నవరసాలూ నిండిన కవిత్వమిది. ఆ కవిత్వాస్వాదనలో నేను బాధలకీ, ఆనందానికీ, ఆశానిరాశలకీ, ఓటమికీ, విజయానికీ, నిస్పృహకీ, ద్రోహానికీ, అసహాయతకీ, గుండెలు చీల్చే మానవ క్లేశాలకీ, సాఫల్యానికీ పరాకాష్ఠని అనుభవించాను.

ఈయన కవిత్వంలో గొప్ప కవిత్వానికి కావలసిన లక్షణాలన్నీ ఉన్నాయి. విశ్వజనీనత ఉంది. కాలాతీత గుణం ఉంది. మానవానుభవాల సంచయంలో వెతికే పెర్ఫెక్ట్ మెటఫర్ ....అద్భుత ప్రతీకలు....భావావేశంలో అవలీలగా సంభవించే లిరికల్ ఎలెమెంట్స్ లయాత్మకతా...క్రియేటివ్ యాక్సిడెంట్స్..... సామాన్య పదాలనే కవి ప్రక్కప్రక్కనే పేరిస్తే వచ్చే మేజిక్....దానిలోని ఊహాతీతమైన శక్తి... మేధకి జోల్ట్ నిచ్చే అపూర్వ శ్రవణం. గుండెలు కదిలిపోయేలా... మనసులో కోటి జ్యోతుల కాంతి నిండినట్లుగా... ఆశాభరితంగా...సర్వమానవాళి మీదా వాత్సల్యం. రెట్టింపు అయేలా...జీవితం మీద ఇచ్ఛ పుట్టేలా.... ప్రపంచం మీద గౌరవం పెరిగేలా....చిత్రంగా....వర్ణనాతీతంగా ఉంది ఆ సమయం. అది కవి సమయం. అది మహాకవి పరంజ్యోతి తన విశ్వరూపం చూపిన ఘడియ. ఆయన కవితాత్మ నన్ను తన దాసుణ్ణి చేసుకుంది.

కానీ, అదే సమయంలో ఆ కవితల్ని సృష్టించిన ఆయనే తన చేతులతోనే వాటిని ఆ మంటల్లో వేసి కాల్చివేస్తున్నాడు.

మధ్యలో ఒకసారి అన్నాడు.

"ఎలా ఉంది?"

"కవిత్వం అద్భుతంగా ఉంది సార్. మీరు వాటిని అలా కాల్చేస్తుంటే బాధగా ఉంది. ఇక ఆపేద్దామా?"

"లేదు నాయనా. నేను చెప్పాను కదా ఇవి చిత్తు ప్రతులని...వీటిలో ఎన్నో తప్పులున్నాయి. రెండు మించిన కాపీలున్నాయి. ప్రతిదాన్నీ నేను ఎన్నో ప్రతులు రాశాను. అరవై ఏళ్ళలో ఎన్ని రాసి ఉంటానో ఊహించు. ఎంత కాగితాన్ని వృథా చేశాను! రాసీ రాసీ నా చేతులు పడిపోయేవి. నా కనుచూపు మందగించేది. ఏకాగ్రతతో నాకు తలనొప్పి వచ్చేది. నిద్రలేక ఆరోగ్యం చెడేది. అయినా, మొండిగా రాస్తూనే ఉండేవాడిని...మళ్ళీ....మళ్ళీ... ఇవన్నీ అసమగ్రమైనవి... వీటిని ప్రచురించడానికి నేను అంగీకరించాను. అందుకనే వీటిని ఇంకా కాపాడవలసిన అవసరం లేదు. నీవు ఈ కవితల్ని వినాలి. ఇప్పటివరకూ విన్నవి ఎలా ఉన్నాయి? అయినా, ఇంకా ఎక్కువ లేవులే. అయిపోవొచ్చాయి" అంటూ ఆహ్లాదకరమైన చిరునవ్వు నవ్వాడు. ఆయన కళ్ళల్లో చలిమంటల కాంతిలో మెరుపులు మెరిశాయి.

చలిమంటలు మండుతూనే ఉన్నాయి. ఒక ప్రక్క కవితా శ్రవణం, మరో ప్రక్క పరశురామ ప్రీతి. ప్రతి కాగితపు ముక్కనీ మంటలు మింగేశాయి. మిగిలినది బూడిద....దానిని కూడా వీచే గాలులు మోసుకుపోతున్నాయి. ఎక్కడెక్కడికో గిరికీలు కొడుతూ కాలిన కాగితపు భస్మం ఎగిరిపోయి నేల మీద ఓ నల్లటి మచ్చ మిగిలింది.

మరికొన్ని రోజుల్లో అదీ ఉండదు.

ఆయన ఉదాసీనతకీ, ఏమాత్రం ఎమోషన్ లేకుండా ఆయన తన కవితలతో చలిమంటలు వేసినందుకు నేను షాక్ తిన్నాను.

అప్పుడు మూడు కాబోతోంది.

"లేద్దామా నాయనా?"

నరేనన్నాను.

ముసలామె కూడా దుప్పటి కప్పుకుని బయటికొచ్చింది.

"నిద్దర్లేకుండా ఏమిటా మొండితనం....ఇంత వయసొచ్చి మీరు ఎవరి మాటా వినరేం....వచ్చి నిద్రపోండి...నీవైనా చెప్పు నాయనా."

"నరే వస్తున్నానులే....నీవెళ్ళి పడుకో."

"వెళదామండి. బాగా లేటయింది. రేపు ఉదయం వస్తాను."

"నరే నాయనా వెళ్ళిరా."

లాడ్జికి వచ్చానే కాని నాకు నిద్ర పట్టలేదు. ఆ అపూర్వ సాయంత్రపు విచిత్రానుభవం నన్ను నిద్రపోనీయలేదు. పైగా, నా మనసు నిండా భరించరాని అతిలోకానందం....ముసిరిన సంగీతభరిత కవితాలోకం. భయం కూడా వేసింది. అదో రకమైన కల్చరల్ వాండలిజమ్‌లో పాలు పంచుకున్నానేమోనని... బాధ్యతారహితంగా తిక్క ముసలాయన మాటలు విని అమూల్యమైన కవిత్వాన్ని అగ్నిపాలు చేశామా అన్న ఆలోచన నన్ను బాధపెట్టింది. కానీ, కాపీలే కదా, అయినా, ఏ కవిత్వానికైనా ఎన్ని కాపీలను దాస్తాము. లిమిట్ ఉండాలి దేనికైనా.

కవితల అన్ని దశల్లోని పరిణామాలనీ ప్రిజర్వ్ చేయాలా అన్న ప్రశ్న కూడా వచ్చింది. ఫైనల్ పొయెమ్‌కీ మొదట రాసిన రఫ్ పద్యానికీ మధ్యన ఎన్ని దశలుంటాయి. ప్యూపాకీ....సీతాకోక చిలక మాదిరిగా ఉండే కవితా పరిణామ క్రమంలో ఎన్ని దశలు కాపాడదగినవి? ఈనాడు జరిగిన కవితా యజ్ఞం ఆ కవితల సృష్టికర్త చాయిస్. ఆయన నిర్ణయం. ప్రొటెస్ట్ చేశాను నేను. నా బాధ్యతను నేను నిర్వహించాను. కాదా?

ఇంతలో నిద్ర ముంచుకొచ్చింది.

* * *

ఉదయాన లేచి రెడీ అయి పరంజ్యోతిగారు ఇచ్చిన అడ్రస్ ప్రకారం శరభయ్యగారింటికి వెళ్ళాను. నిద్ర లేమితో తల దిమ్ముగా ఉంది. కొన్త పెద్దదే అయిన జాగాలో ఉన్న రెండంతస్తుల భవనం అది. గాడీ రంగులు వేసి ఉన్నాయి. బెల్లు కొట్టాను.

ఓ లావుపాటి ఆయనొచ్చాడు. పొట్టిగా ఉన్నాడు. పంది కళ్ళల్లా సూటిగా మెరుస్తున్నాయి. మనుషుల మీద అట్టే నమ్మకం లేనట్లుగా అనుమానంగా చూస్తున్నాయి. వేళ్ళకి రకరకాల ఉంగరాలు. కోరా రంగు సిల్కు లాల్చీ.... కింద లుంగీ...

"ఎవరు బాబూ తమరు?"

"నేను పరంజ్యోతిగారి తాలూకునండి. డబ్బు ఇవ్వడానికి వచ్చాను."

ఆయన ముఖం ఆనందంతో విప్పారింది.

"రాండి రాండి బాబూ దయచెయ్యండి. డబ్బంతా తెచ్చారా?"
"తెచ్చాను."
నన్ను చెక్క కుర్చీ మీద కూర్చోబెట్టి తాను ఉయ్యాలబల్ల మీద కూర్చున్నాడు ఊగుతూ.
"ఇదిగో రెండు కాఫీలు పంపు" అని కేకేశాడు.
"నేను వెళ్ళాలండి. మీరు లెక్క చెప్పండి ఎంతివ్వాలో. మళ్ళీ నాకు పనులున్నాయి."
లోపలికెళ్ళి వడ్డు పుస్తకం తెచ్చాడు. ఏవేవో లెక్కలేసి చివరికి చెప్పాడు.

"మొత్తం వడ్డీతో సహా మూడు వేల తొమ్మిదొందల తొంభై నాలుగు బాబూ." అతడి కళ్ళు ఆశతో జుగుప్సాకరంగా చూస్తున్నాయి. నిజంగా వీడు డబ్బు తెచ్చాడా లేదా అన్న సందేహం కూడా ఉంది వాటిలో. డబ్బు తీసి లెక్కపెట్టి ఇచ్చాను. నాలుగు వేలు. ఆయన రెండు సార్లు ఎంచుకున్నాడు వేలిని నాలుకతో తడుపుకుంటూ. తర్వాత నోట్ల కట్టని లాల్చీ జేబులో పెట్టుకున్నాడు భద్రంగా.
"బాబూ నివ్వెవరవో గానీ దేవుడివే. ఆ డబ్బు ఈ జన్మలో కళ్ళజూస్తానను కోలేదు. ఆశలు వదిలేనుకున్నాను కర్మలే అని. మళ్ళీ తిరగ రాస్తే ఆ కొంప మీద మరో పదేల్లదాకా రాయించొచ్చు. అంతకన్నా నేను సావలేను. అసలే యాపారవంతా మోసం. ప్రతివాడూ ఫ్రాడు చేద్దామనుకునేవోడే. అంతా మోసం బాబూ మోసం. అద్సరే గానీ బాబూ నువ్వూ కవివేనా?"
అతడు అడిగిన ధోరణి చూస్తే "నీవూ పిచ్చివాడివేనా? లేక హంతకుడివేనా?" అని అడిగినట్లుగా, అసహజంగా, చికాగ్గా ఉంది.
"కాదండీ."
"మంచి మాట జెప్పావు బాబూ. ఆ పెట్టెలో ఉన్న కాయితాలు ఏ పకోడీల వాడికో అమ్మితే పది కేజీలు తూగి, ఏ ఇరవయ్యో ముప్పయ్యో చేతికొస్తయ్యేమో నని జడిచ్చచ్చాననుకో. మాయావిడ కూడా మెదడు తినేసింది బాబూ. కవులకీ, రచతలకీ; కతల్రాసే వోళ్ళకీ అప్పులెట్టద్దూ అని. దాని మాట ఇన్నా ఈ దరిద్రం పట్టేది కాదు. ఆ ఇంటి సుట్టూతా తిరిగి సెప్పులరిగిపోయినాయి బాబూ. ఇయ్యాల్లా....రేపురా....మాపురా...అంటూ నన్ను తిప్పి తిప్పి సంపారు బాబూ. పైగా, ఎళ్ళినప్పుడల్లా వందో రెండొందలో అప్పివ్వాల్సొచ్చేది. మా సెడ్డ సికాకు బేరమనుకోండి. అయినా, వడ్డీ యాపారంలో పడితే సికాకులు తప్పవు బాబూ."
ఈ మాటల ధోరణికి నాకు కంపరమెత్తుతోంది.
"మీ డబ్బు ముట్టింది కదా?"
తలాడించాడు అవునన్నట్లుగా. ఆయన చెప్పే కబుర్లు వినటానికి నాకు టయిమ్ లేదనీ, నాకు పెట్టె తెచ్చి ఇస్తే నా దారిన నేను పోతాననీ మళ్ళా చెప్పాను. ఋణపత్రాలూ అవీ తిరిగి ఇచ్చేశాడు. పరంజ్యోతిగారి ఋణం తీరిపోయింది.
"ఈ డబ్బంతా నీదేనా బాబూ?"
వీడికెందుకు ఈ గోల. అయినా, సహనంతో చెప్పాను.
"లేదండీ. మిత్రులం కొందరం కలసి చందాలేసుకున్నాం."
"అవున్లే బాబూ. ఈ లోకంలో రకరకాల వాళ్ళుంటారు. యవడి పిచ్చి వాడిదే. కాగితాల పిచ్చోళ్ళుంటారని ఇప్పుడే తెలిసింది బాబూ. ఇదిగో...సూడూ..." అని అరిచాడు.
"ఏంటీ?....ఏం గావాలీ?" అనే అరుపు వచ్చింది ఇంట్లోంచి ఇంకా పెద్ద గొంతుకతో.
"అటక మీద ఉండే నగిషీ చెక్కపెట్టె. దాన్ని దింపి కిందెట్టు. దాంటో ఆ ముసలాయనగారి కాయితాలుండాలి. కవిత్వం, కతలూ, కాకరకాయలూ ...ఏంటో ఉన్నయ్యట. భద్రంగా దింపు. మీద పడేనుకునేవు."
"సర్లే." కాస్సేపాగాక మరో కేక.
"ఇదిగో పెట్టె దింపాను. వచ్చి పట్టుకుపో.
ఇంతకీ కాఫీలు కావాలా, వద్దా?"



ఆయన లోపలి కెళ్ళాడు.
రొప్పుతూ రోజుతూ ఈ రోజుల్లో అపురూపం అయిపోయిన ఓ చెక్క పెట్టెను తెచ్చాడు. దాని మీద మంచి చెక్కడపు పని ఉంది. దానిని చూడగానే నా మనసు అనిర్వచనీయమైన ఆనందంతో నిండిపోయింది. ఎట్‌లాస్ట్ అను కున్నాను. మా కల నిజం కాబోతోంది. పరంజ్యోతిగారు తెలుగు కవితాకాశంలో ధ్రువతారలా వెలిగి పోతారు. తెలుగు సాహిత్య చరిత్ర మళ్ళీ తిరగరాయాలి. అందులో ఆయన స్థానం పదిలంగా ఉంటుంది. అందులో సందేహం లేదు.
ఆయన పెట్టెని అక్కడ ఉన్న ఓ బల్ల మీద పెట్టాడు. ఆయాసంతో వగరుస్తూ పోయి ఉయ్యాల బల్ల మీద కూర్చుని ఊగుతూ పైపంచెతో విసురుకుంటున్నాడు.
నేను వెళ్ళి ఎంతో ఆర్తితో మెల్లగా ఆ పెట్టె మీద చేతులు వేశాను. కాసేపు దానిని నిమిరాను. అదేదో ట్రెజర్ చెస్ట్‌లా ...అమూల్య నిధులున్న మంజూషలా... ఊపిరి బిగపట్టి మెల్లగా చిన్న గొళ్ళాన్ని తీసి పెట్టెని తెరిచాను.
నా రక్తం గడ్డకట్టుకుపోయింది.
దాని నిండా బొద్దింకలు.... సిల్వర్ యాంట్స్.
కాగితాలని బాగా తిని బలిసి ఉన్న అవన్నీ ఒక్కసారిగా బయటికి వచ్చి దూకి, ఇల్లంతా పరచు కుంటూ నాలుగు మూలల్లోనికీ పారిపోయాయి.
ఇంటాయన గావుకేకలు పెడు తున్నాడు. ఆ పెట్టెలో చిన్న కాగితపు ముక్కలు ... ఎలుకల పెంటికలూ.... చచ్చిన బొద్దింకల తాలూకు రెక్కలూ... ఉన్నాయి. కవిత లేమీ లేవు దానిలో.
పరంగారే గెలిచారు చివరికి. ■